# స్వాభిమానం

పిల్లల ఆటలు, కేరింతల్తో ఆవరణంతా ఒకటే సందడిగా ఉంది. వరండాలో ఈజీ చెయిర్లో నడుం వాల్చి పిన్ని- అటు మినుములు బాగు చేస్తున్న పనివాళ్ళనీ, ఇటు ఇసక గుట్ట మీదెక్కి తొక్కి పోస్తూన్న పిల్లల్నీ ఒకేలా అదలిస్తోంది. మధ్య మధ్యలో ఒకటీ అరా కుశలప్రశ్నలు నా మీదికి విసురుతోంది.

"దసరాల నాటికే ఢిల్లీలో చలి ఒణికించేస్తుందంట కదా! మనకిక్కడ ఎండలిలా మండి చస్తున్నై. ఆ పైన కరెంటు కోతొకటి" అంది కింద పెట్టిన విసన కర్రని మళ్ళీ అందుకుంటూ.

విశాలమైన ఈజీ ఛెయిర్లో ఇరుకుగా, ఇబ్బందిగా కదులుతోంది పిన్ని.

ఏటి ఒడ్డున ఇల్లు, పడమటి వైపు వరండా కావడం వలన నడినెత్తి మీంచి దిగబోతూన్న సూర్యుడి కిరణాలు ఏటినీటిలో పరావర్తనం చెంది, విశాలమైన వరండా అంతట్నీ నారింజ రంగు వెలుగుతో నింపేసాయి. పిన్ని కట్టుకున్న కాషాయరంగు కంచిసిల్కు చీర ఆ వెలుగులో తళుకులీనుతోంది.

నల్లచేవకర్ర- చిలకలు, లతల్తో చేసిన వాలు కుర్చీ కాళ్ళు పెట్టుకునే బూరుగుదూది దిండుతో సహా ప్రత్యేకంగా ఉండి, పిన్నికి ఇది వరకు లేని రాజసాన్ని సమకూర్చి పెడుతోంది.

వెనకవైపు ధాన్యం గదుల్ని పడగొట్టించి నాలుగు పోర్షన్లుగా శ్లాబ్‌వేయిస్తోంది. ఊళ్ళో నాలుగురకాల ఆఫీసులు వెలియడంతో ఇళ్ళకి గిరాకీ పెరిగి మంచి అద్దెలొస్తున్నాయట. ఊళ్ళో అమ్మకానికొచ్చిన అయిదారిళ్ళుకొని బాగుచేయించి పిన్ని అద్దెలకిచ్చిందనీ, వాటినుంచి ఆదాయం బాగా వస్తోందనీ కర్ణాకర్ణిగా విన్నాను. పిన్ని మాత్రం తనకు తానై నాకేమీ చెప్పలేదు.

ఏటి గలగలల శబ్దం విని అటు తిరిగి చూసేను. అవతలి ఒడ్డునుంచి బల్లకట్టు మీద పాతిక ముప్పై మంది ఇటువైపొస్తున్నారు. నా చిన్నతనం నుంచి

పడుతుంది పడుతుందనుకున్న వంతెన ఇప్పటికింకా ప్రారంభమే కాలేదు. ఏటికవతలి ఒడ్డున దివాణం బిల్డింగు రంగు వెలిసిపోయి రాజసం కోల్పోయిన రారాజులా దీనంగా నిలబడి ఉంది. అటువైపు ఊరు మాత్రం బాగా పెరిగినట్టుంది. కొత్తగా కట్టిన పెంకుటిళ్ళు చాలా కన్పిస్తున్నాయి. ఇరవై ఏళ్ళ క్రితం మేం ఈ ఊరు విడిచి వెళ్ళే నాటికి దివాణం, దాని తాలూకు మాజీ ఉద్యోగుల పాడుపడిన నాలుగైదు పెంకుటిళ్ళు తప్ప ఏమీ ఉండేవి కావు.

ఈ మధ్యనే ప్రభుత్వం దివాణం తాలూకు ఖాళీ స్థలాలన్నింటినీ బడుగు వర్గాలకి ఇళ్ళ స్థలాలుగా పంచి ఇచ్చేసిందట. నిజానికి కాలవకిటువైపుకూడా ఊరింతగా పెరుగుతుందని మేమెవ్వరం అనుకోలేదు. నాకు పదేళ్ళ వయసొచ్చే వరకూ అటు వైపున్న జమీందారుపాలెం లోనే పెరిగాను. మా తండ్రి దివాణంలో ఉద్యోగిగా పని చేసిన వాడవడం వలన మాకు కేటాయించిన ఇంట్లోనే మేముండే వాళ్ళం. జమీలు వాటి తాలూకూ ఆదాయాలు పోయినా జమీందారీ కుటుంబాలకు మిగిలిన స్తిర చరాస్తుల్తో కొన్నేళ్ళపాటు రాజసం బాగానే సాగింది. కూర్చుని తింటే కొండలైనా కరుగుతాయన్న చందం బైటపడ్డాక ఖర్చులు తగ్గించే క్రమంలో ఉద్యోగులందర్నీ తీసేసారు. కానీ వాళ్లుండే ఇళ్లను మాత్రం ఖాళీ చేయించలేదు. అది జమీందారిణి భారతమ్మ గారి మంచితనం అని నాన్నగారు అంటుండేవారు. ఆ కృతజ్ఞతతోనే నాకావిడ పేరు పెట్టారట.

కాలక్రమంలో మా నాన్నగారు, మా బాబాయి కాలవదాటి ఇటువైపొచ్చి ఏవో చిన్న వ్యాపారాలు ప్రారంభించారు. ఈ ప్రాంతమంతా నల్లరేగడినేల కావడం వల్ల పూలతోటలు, పళ్లతోటలు బాగా విస్తరించేయి. క్రమంగా పూలకీ పళ్ళకీ తూర్పుగోదావరి జిల్లాలోనే ప్రశస్తి గడిచిందీ ప్రాంతం. నాన్నగారికి వ్యాపార లావాదేవీలు పట్టుపడక, ఏదో చిన్న ఉద్యోగం చూసుకుని హైదరాబాద్ తీసుకెళ్లిపోయారు మమ్మల్ని. మా బాబాయికి పళ్లవ్యాపారంలో మంచి లాభాలొచ్చి ఇక్కడే నిలదొక్కుకున్నారు.

బల్లకట్టు ఇవతలి ఒడ్డుకు చేరింది. దిగిన వాళ్లంతా రేవులో మెట్లెక్కి రోడ్డుమీదికి వెళ్తున్నారు.

వెలిసిన పాత చీర కట్టుకున్న వయసు మళ్లిన ఒకామె రేవుకివతలి పక్క కంచెదాటి కాలవ ఒడ్డు బురదలో నాలుగడుగులు నడిచి మెట్లెక్కి వచ్చింది.

గేటు తీస్తున్న చప్పుడుకి అటు తిరిగి చూసిన పిన్ని ఆమెని చూసి విసుగ్గా మొహం పెట్టుకుంది. "ఇదొకత్తి మేళం, వేళాపాళా వారం వర్జెం లేవు" అంటూ సణుక్కుంది.

ఆ సరికే నేను పున్నమ్మని పోల్చుకున్నాను.

దివాణంలో భారతమ్మగారి చెలికత్తె అనబడే పనిమనిషి ఈమె. ఆ రోజుల్లో భారతమ్మగారి స్నానం పానం అన్నీ ఈమె చూడాల్సిందే. మెట్లెక్కి వచ్చినందుకు కాబోలు ఆయాస పడుతోంది పున్నమ్మ. అలసటగా అరుగు మీద చతికిలబడి చిరిగిన చీరకొంగుతో మొహం ఒత్తుకుంది.

"కుసిన్ని మంచి నీళ్లిప్పించడమ్మా"అంటూ మొహమెత్తి నావైపు పరికించి చూసి

"ఎవరూ సిన్న బారతమ్మే?" అంది ఆశ్చర్యంగా.

"నా తల్లి నా తల్లి ఎన్నాళ్ళయ్యిందమ్మా నిన్ను చూసి" అంది.

పున్నమ్మ పోల్చుకున్న తీరుకి నేను అబ్బురపడ్డాను.

కుర్చీ దిగి పున్నమ్మ పక్కన కూర్చుంటూ "బాగున్నావా పున్నమ్మా" అన్నాను.

పున్నమ్మ నా చెంపలూ భుజాలూ తడిమి, తలపైన చెయ్యేసి నిమురుతూ "ఇదిగో ఇలాగున్నాను తల్లీ, ఎంతదానివయ్యేవు! మీరీ వూరి నించి ఎలబారేసరికి బక్కపలసగా ఇంతుండేదానివి. అమ్మగారి పేరెట్టినందుకు అంత మనిషివీ అయ్యేవు" అంది. ఆమెలో గతం తాలూకు ఏ జ్ఞాపకాలు కదిలేయో ముఖం ముడతలు విడి ఉద్వేగంతో ఎర్రబడింది. కళ్లల్లో చివ్వున నీళ్లు చిప్పిల్లి వచ్చేయి.

"ఆ నాటి మనుషులేరి బారతమ్మ తల్లీ, వైబవంతో బాటు అబిమానాలూ

తరిగిపోయేయి" అంది కొంగుతో కళ్లు ఒత్తుకుంటూ.

పనివాళ్లు మినుములు బాగుచెయ్యడం పూర్తయినట్టుంది బస్తాలకెత్తుతున్నారు. వాళ్లు నన్నూ పున్నమ్మనీ ఆశ్చర్యంగా మార్చి మార్చి చూస్తున్నారు.

రావాల్సిన డబ్బులు తీసుకుని వాళ్లెళ్లిపోయేక "ఇంతకీ ఏం పనిమీద వచ్చేవేంటి" అంది పిన్ని విసుగునంతా గొంతులో ధ్వనింపజేస్తూ. పున్నమ్మ లేచి తడబడే అడుగుల్తో పిన్ని కూర్చున్న అరుగువైపు నడిచింది. లోపలి కొంగున పదిలంగా కట్టి తెచ్చిందేదో ముడివిప్పుతోంది. అంతవరకూ అక్కడున్న వారెవరూ పున్నమ్మకు తాగేందుకు నీళ్లిచ్చే ప్రయత్నం చెయ్యకపోవడంతో నేను లేచి వెళ్లేను. చల్లని నీళ్లు చెంబునిండా తెచ్చి పున్నమ్మకందించేను. ఎంత దాహంతో ఉందో ఏమో చెంబుని ఎత్తిపట్టుకుని నీళ్లని గడగడా తాగుతోంది పున్నమ్మ.

అటు తిప్పీ ఇటు తిప్పీ పరికించి చూస్తున్న పిన్ని చేతిలోని వస్తువు పైకి మళ్ళింది నాదృష్టి. అరచెయ్యంత రాగిడీ అది. ఉదయించే సూర్యబింబం డిజైనులో పుష్యరాగాలూ కెంపులూ పొదిగిన ఆ రాగిడీ సంధ్య కిరణాలు పడి కళ్లు జిగేల్మనేలా మెరుస్తోంది.

ఆ నగను చూడగానే గుర్తు పట్టేను నేను అది భారతమ్మగారిది. రోజూ క్రమం తప్పకుండా ధరించే ఆవిడ నగల్లో ఇదొకటి, చిన్ని నాగరం జడపాయల్తో బంధించబడి ఆవిడ నడినెత్తిన ఎప్పుడూ కాంతులీనుతూ ఉండేది. బారుకురులు విప్పి పున్నమ్మ చేత చిక్కుతీయించుకునేటప్పుడు కూడా ఆవిడ ఈ నగను తీసి పక్కన పెట్టడం నేనెప్పుడూ చూడలేదు.

భారతమ్మగారి అత్తగారు చిలకమ్మగారు కోడలికి నగలన్నీ ఇచ్చినప్పుడు తరతరాల నుంచి వస్తూన్న ఈ రాగిడీని ప్రత్యేకంగా ఇచ్చి శుక్రవారం, మంగళవారం ఆ నగను విప్పి పక్కన పెట్టొద్దని చెప్పిందట. అందుకనే భారతమ్మగారు శనివారం రోజు తలంటి పోసుకునేదట. జుట్టుముడి ఆరక ముందే ఈ నగ ఆవిడ నెత్తిన ప్రత్యక్షమయ్యేది. ఆ రోజుల్లో దివాణం ఇళ్లల్లో ఇలాంటివన్నీ కథలు కథలుగా

చెప్పుకునేవారు.

"దీనిమీద పదిహేనువేలు ఎవడిస్తాడు" అంటోంది పిన్ని. "మూడు తులాలుంటుందా?"

"అయ్యో, అయిదు తులాలమ్మా, నీకేం నష్టం ఉండదు"

"ఆ.... ఉండదు. ఇది వరకు పెట్టినవన్నీ అలాగ మురగబెట్టేరు. ఒక్కటన్నా విడిపించుకెళ్లేవా? ఆ డబ్బుంటే ఈ పాటికి ఎంత వడ్డీ వచ్చుండేది!"

"ఇదేంటమ్మా, బంగారవే కదా"

"ఆ-బంగారవే, గుడ్లెడుతుందా? దాచలేక చస్తున్నాం, మీయమ్మ గారికి చెప్పు ఇంక ఆగేది లేదూ- అవన్నీ అమ్మిపడేస్తానన్నానని. బంగారం ధర పడిపోయి చచ్చింది తెల్సా!"

పున్నమ్మ సమాధానం చెప్పలేక గుక్కిళ్లు మింగింది. పిలవకుండానే ఆమె కళ్లల్లోకి నీళ్లు ఊరి వస్తున్నాయి. ఈ వయసులో ఆ కళ్లల్లో ఇంకా అన్ని నీళ్లెక్కడ మిగిలి ఉన్నాయో!

"పాత బంగారం, దానికి తోడు ఈ రాళ్లూ రప్పల్తోటి అమ్మినా రేటు రాదు, పదివేలిస్తాను, మధ్యలో మళ్ళీ అంత కావాలి ఇంత కావాలి అనొస్తే ఇవ్వను. కావాలంటే పట్టుకెళ్లు, లేపోతే ఇంకెక్కడైనా ప్రయత్నించుకో"

"మీరు తప్ప నాకింకెవరు తెల్సమ్మా. దివాణం పరువుని ఇంకెక్కడ తాకట్టెట్టగల్ను" విలవిలలాడింది పున్నమ్మ.

"అవి చాలా ఖరీదైన రాళ్లు పిన్నీ" అన్నాను నేను ఉండబట్టలేక. పిన్ని ఇంట్లోకి వాలు కుర్చీతో సహా ఇంత అందమైన యాంటిక్ ఫర్నిచరు ఎలా వచ్చిందో నాకిప్పుడు పూర్తిగా అర్థమైంది.

పిన్ని నావైపొక చురుకైన చూపు విసిరి మొహం తిప్పుకుంది. "అవునే పున్నమ్మా, ఇప్పుడింత డబ్బెందుకు? పిన్ని గొంతులో కుతూహలం. పున్నమ్మ మాట్లాడలేదు.

"దసరా వస్తోంది కదా, దేవీ పూజలూ సంతర్పణలూ కాబోలు. చింత చచ్చినా పులుపు చావడంలే" అంటూ లేచెళ్లింది పిన్ని.

పాత కాలం నాటి వాలు కుర్చీ బాధను వెళ్లబోస్తూ కిర్రు కిర్రుమని ఆక్రోశించింది.

"ఇంకా అన్నదానాలూ సంతర్పణలూ ఎక్కడ మిగిలేయమ్మా" తనలో తనే అనుకుంటోంది పున్నమ్మ.

"అమ్మగారు ఎలా ఉన్నారు పున్నమ్మా" అన్నాను భారతమ్మగార్ని కళ్లల్లోకి తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ.

"ఎలాగుంటారమ్మా" పున్నమ్మ కళ్లల్లోంచి నీటిబొట్లు జలజల రాలాయి. ఇదే ఆఖరి నగ అంది. పెట్టితో పెట్టెడు నగలు, బోలెడంత ఎండిసామాను, కాళ్లొచ్చి నడిసెల్లిపోయేయి. ఇదాయమ్మకి ప్రేణవైన నగ. దివాణం లోగిలి తనకాలోకి ఎల్లిపోయినప్పుడు గూడా ఆయమ్మకంత ఏడుపు రాలేదు. ఇయ్యాళ ఏవేడిసిందో మా తల్లి."

పిన్ని వందరూపాయల నోట్లకట్ట తెచ్చి పున్నమ్మ చేతిలో పెట్టింది. "పదివేలు, లెక్కెట్టుకోమను. పొద్దుగుంకుతా ఉంది. ఏట్లో ప్రయాణం, జాగ్రత్త" అంది.

పున్నమ్మ చీరకొంగున నోట్లకట్టను జాగ్రత్తగా మడిచి పట్టుకుంది. "ఎళ్లొత్తానమ్మా" అని పిన్నితో చెప్పి "బారతమ్మ తల్లీ, ఏటవతలికి ఓపాలొచ్చి పోరాదూ" అంది.

నాకూ భారతమ్మగార్ని చూడాలన్పించింది. "నీతో వస్తున్నాను పద" అంటూ లేచేను.

"పొద్దుపోతోంది, ఇప్పుడెందుకు, రేపెళ్దువు గానిలే" అంది పిన్ని.

"త్వరగా వచ్చేస్తాలే పిన్నీ" అంటూ ముందుకి నడిచేను.

మాతృస్థానంలో ఎక్కడో కురిసిన వరదనీరు కాబోలు కాలవలో ఎర్రగా సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. గెడని కాలవ గర్భంలో గుచ్చి బల్లకట్టును అడ్డంగా

నడుపుతున్నాడు సరంగు, నీటివేగాన్ని చీల్చుకుని బల్లకట్టు నెమ్మది నెమ్మదిగా ఆవలి తీరానికి గమిస్తోంది.

పున్నమ్మ డబ్బును పదిలంగా పట్టుకుని కూర్చుంది. ఆవలి ఒడ్డున కూసాలు జారిపోయిన దివాణం భవనంలాగే వెన్నముక కృంగిపోయి ఉంది. పున్నమ్మ ముఖం మీది ముడతల్ని బట్టి ఆమెకెన్నేళ్లుండచ్చో అంచనా వేసేందుకు ప్రయత్నిస్తున్నాను.

మా అమ్మ చెప్పేది-

దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడే పన్నెండేళ్ళ భారతమ్మ కాపురానికి వచ్చిందట. ఆమె వెంట ఈనాముగా వచ్చిన దాసీ జనంలో ఈ పున్నమ్మకి భారతమ్మంటే ఎనలేని అనురాగం. భారతమ్మ కన్నా పది పన్నెండేళ్లు పెద్దదైన పున్నమ్మ పెళ్లి- ఇల్లు అనకుండా జమీందారీ కుటుంబానికే అంకితమైపోయింది. నాకు ఊహ తెలిసే నాటికి మంచి ప్రౌఢప్రాయంలో ఉన్న పున్నమ్మ కాళ్లకి వెండి మువ్వల పట్టీల్తో ఘల్లు ఘల్లుమని నడుస్తూ ఉండేది. దివాణంలోని మగాళ్లు కొందరు ఈమె వినకుండా గజ్జెల గుర్రం వస్తోంది అనేవారు.

పెద్ద జమీందారిణి చిలకమ్మగారికి ఒక్కడే కొడుకు. ఆయన కడుపున పదిమంది సంతానం కలిగితే చూసి సంతోషించాలనుకున్న చిలకమ్మగారు మనవల్ని చూడక ముందే కాలం చేసారట. భర్తపోయి కొడుకు అందిరాక ఇంగ్లీషువాళ్లతో నెగ్గుకొచ్చిన ఏకైక స్త్రీ జమీందారిణి గోదావరిజిల్లాల్లో చిలకమ్మగారేనట. గోదావరి కాలవలకింది లంకల్లోని వందల ఎకరాల భూముల నుంచి వచ్చే కిస్తీ ఫలసాయంతో జమీ 'కో' అంటే 'ఓ' అని పలుకుతుండేదట.

స్వతంత్రం వచ్చాక జమీలన్నీ ప్రభుత్వం రద్దు చేసాక 'కోడలు అడుగు పెట్టిన వేళా విశేషం' అని బంధువులందరూ భారతమ్మగార్ని ఆడిపోసుకుంటూంటే చిలకమ్మగారు పెద్ద మనసుతో కోడల్ని వెనకేసుకొచ్చి, అలా అన్న వాళ్లందర్నీ మందలించేవారట.

గులాబీ పువ్వు లాంటి భారతమ్మగార్ని వదిలి జమీందారుగారు ఎక్కడెక్కడో



కథా నిలయం
5155
శ్రీకాకుళం

తిరుగుతాడని చెప్పుకునే వారు. భారతమ్మగారికి వెన్ను ముదిరి సంతానం కలిగిందట. ఇద్దరు కొడుకులు.

భారతమ్మగారికి ఆడపిల్లలు లేకో ఏమో నన్నూ, నా వయసు ఆడపిల్లల్నీ చాలా ముద్దుచేసేవారు. ఆవిడ కొడుకులిద్దరూ డెహ్రాడూన్‌లోనో మరెక్కడో రెసిడెన్షియల్ లో చదువుతున్నారని చెప్పుకోవడం గుర్తు.

సెలవులకు వచ్చినప్పుడు కూడా వాళ్ళ వెంట ఓ ట్యూటరు వచ్చేవాడు. రోజుకో గంట మాత్రమే ఆటవిడుపు వాళ్ళకి. ఆ సమయంలో పెద్దవాడు పద్దరాజు తెల్లని డ్రెస్ వేసుకుని వాళ్ల ట్యూటరుతో క్రికెట్టు ఆడేవాడు. చిన్నవాడు మూర్తిరాజు మాత్రం మా వయసు పిల్లల్తో చేరిపోయి బొమ్మల పెళ్ళిళ్ళు, బువ్వాలాటలు ఆడేవాడు.

"పున్నమ్మా, ఇలా నగలు తాకట్టు పెట్టడం ఏవిటి, భారతమ్మగారి కొడుకులు ప్రయోజకులు కాలేదా?"

"కాకేం తల్లీ, పద్దరాజు ఎక్కడెక్కడో సదువుకుని, ఏవేంటో పరీక్షలు పేసై తండ్రిగారు కాలం చేసే నాటికొచ్చేడు. ఎవరో దొరసాన్ని పెళ్లాడి సముద్రాలకవతల ఏదో దేశంలో ఉన్నాడంట. సిన్నాయన మూర్తిరాజు- చెప్పటానికేవుందిలేమ్మా, కడుపు చించుకుంటే కాళ్లమీద పడతాది"

తెప్ప అవతలి ఒడ్డుకి చేరేసరికి సంధ్యా సమయం కాబోతోంది. కాలవ గట్టున మెట్లెక్కి పైకెళ్లగానే "జెడ్ పాలెం" అంటూ బోర్డు దర్శనమిచ్చింది. జమీందారుపాలెం ఇప్పుడు జడ్‌పాలెం అయినట్టుంది.

కాలవగట్టు దిగగానే దివాణానికి ఆగ్నేయ మూలలో ఏనాటినుంచో నిలిచి ఉన్న రావిచెట్టు కన్పించింది. కొమ్మలన్నీ విరిగిపోయి ఏకశాఖతో ఒంటికాలి మీద తపస్సు చేస్తున్న వృద్ధముని పుంగవుడిలా ఉంది. కొమ్మమీదున్న ఒకే ఒక పక్షిగూడులోంచి కొంగపిల్లలు తల్లికోసం కాబోలు కిర్‌కిర్‌మని అరుస్తున్నాయి.

నా చిన్నతనంలో ఈ చెట్టు రాత్రయితే చాలు జుట్టు విరబోసుకున్న రాక్షసిలా భయపెట్టేది. దానికితోడు ముసలివాళ్లు చెప్పే కాకమ్మ కథలు మరింత భయపెట్టేవి.

చెట్టుకొమ్మల్లోకి దృష్టినిగిడ్చి చూడాలంటే భయం వేసేది. అప్పటికింకా కరెంటు దీపాలకు నోచుకోని ఈ వూళ్లో చిన్నపిల్లలం సంధ్యవాలితే చాలు అమ్మకొంగు చిటికెనవేలికి చుట్టుకుని తిరుగుతూ ఉండేవాళ్ళం. చెట్టుమీది వందలు వేల పక్షుల అరుపుల్తో జమీందారుపాలెం మేల్కొనేది ఆ రోజుల్లో.

తూర్పు వైపు ముఖ ద్వారం పక్క గోడంతా పడిపోయి ఉంది.

దక్షిణం వైపు పెరటి గుమ్మంలోంచి దివాణం ఆవరణలోకి అడుగుపెట్టగానే నా ఒళ్ళు సన్నగా కంపించింది.

ఓడలు బళ్లు కావడం అంటే ఇదే కాబోలు.

ఆనాటి పూలతోటలేవి? ఆనాటి వైభవమేది?

ఒక్కసారిగా వెనక్కి తిరిగి పారిపోవాలన్పించింది.

బోసిపోయిన గదుల్లోంచి, బాల్యం నాటి జ్ఞాపకాల చౌదురాల్తున్న గోడల్ని దాటుకుని పున్నమ్మ వెంట ఉత్తరం వైపు గదిలోకి అడుగుపెట్టేను.

బైట ముసురుకోబోతున్న చీకట్లు ముందే ఈ శిథిల భవనాన్ని ఆక్రమించుకున్నాయి.

పున్నమ్మ గూట్లోంచి అగ్గిపెట్టెతీసి గోడపక్కనున్న హరికేన్ లేంపు వెలిగించింది. "బిల్లు కట్టక కరంటు పీజులు పీకేసేరు" నాకు మాత్రమే వినపడేలా గుసగుసలాడింది.

చాపమీద వ్యాసపీఠంలో భగవద్గీత కాబోలు తెరిచిపెట్టి ఉంది.

నవారు మంచంలో ముడుచుకుని పడుకున్న ఆవిడను భారతమ్మగారని గుర్తు పట్టడానికి కొంత టైము పట్టింది.

"మిమ్మల్ని చూడ్డానికి ఎవరొచ్చేరో సూడండి" అంటోంది పున్నమ్మ. అతి ప్రయత్నం మీద లేచి కూర్చున్నారావిడ.

"సిన్న బారతమ్మొచ్చింది."

కాంతి లేని గాజుకళ్లతో ఆవిడ నావైపు నిర్లిప్తంగా చూసింది. ఎన్నెన్ని సమస్యలు, ఎన్నెన్ని దుఃఖభారాలు భారతమ్మగారినిలా తయారుచేసాయో! దానికి సాయంగా వయసామె శరీరాన్ని నిర్దయగా ఆక్రమించుకుంది.

"అమ్మగారికి నాలుగు రోజుల్నుంచి జొరవమ్మా. మందూ లేదు మాకూ లేదు. ఇయ్యాళ ఏపుడు జావకూడా ఇయ్యలేదు" పున్నమ్మ వంట ప్రయత్నంలో కాబోలు హడావుడిగా అటూ ఇటూ తిరుగుతోంది.

గోడకవతలి వరండాలో ఖళ్లు ఖళ్లు మని దగ్గుతున్నారెవరో. "పున్నమ్మా, డబ్బు తెచ్చేవా లేదా?" గొప్ప అసహనం ఆ గొంతులో.

పున్నమ్మ వణికి పోతూ లాంతరు పట్టుకుని అటు నడిచింది.

మడత మంచం మీద చిరుగుల దుప్పటి, స్టూలు మీద ఖాళీ స్కాచ్ బోటిల్, గాజుగ్లాసు, ఇత్తడి చెంబుతో నీళ్లు.

పున్నమ్మ అరుగు చివరికి నడిచింది.

స్తంభానికి చేరబడి ఛాతీ మీదికి తలవాల్చుకుని కూర్చున్న వ్యక్తి ఉన్నట్టుండి తలపైకెత్తి చూసాడు. లాంతరు వెలుగులో పులికళ్లలా మెరుస్తున్న రెండు కళ్ల తాలూకు వ్యక్తిని మూర్తిరాజని గుర్తుపట్టడానికి నుదుటి మీద కుంకుడు గింజంత పుట్టుమచ్చ తప్ప మరేమీ మిగలలేదు. మాసిన లాల్చీ షరాయిలో బక్కచిక్కిన అతని దేహం ఎముకల గూడులా ఉంది.

నా వైపు నిశితంగా రెండు క్షణాలు చూసి విసురుగా తల తిప్పు కున్నాడు. అతను నన్ను గుర్తు పట్టేడో లేదో నా కర్థం కాలేదు. పలకరించ బుద్ధి కాక, నేనూ వెనక్కి నడిచేను.

పున్నమ్మ ఓర్పుగా అతనికేదో నచ్చ చెప్పడానికి ప్రయత్నిస్తోంది.

తూర్పువైపు గుమ్మంలో కొచ్చి నిలబడ్డాను. వెనక్కి తిరిగి చూస్తే గుండె

బరువెక్కింది. ఈ గదుల నిండా ఎందరెందరు బంధు వర్గం వచ్చి విడిది చేస్తూ ఉండేవారు! బెల్లంలేని చోట ఈగలెందుకు ముసురుతాయి! ఏనాటి ఋణాను బంధమో పున్నమ్మ వీళ్లనిలా అంటిపెట్టుకుని చాకిరీ చేస్తోంది.

"పదండమ్మా, ఇంకా పొద్దోతే బల్లకట్టు నడపడు బాపయ్య. మిమ్మల్ని దిగబెట్టి వత్తాను" అంది పున్నమ్మ.

నన్ను బల్లకట్టు ఎక్కించి వెనుతిరిగింది.

తూర్పున ఉదయించిన చందమామ మీదికి మబ్బు తెరొకటి వచ్చి ఆవరించుకుంది.

మూర్తిరాజు గురించి పున్నమ్మ అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"ఈ బాబు పెళ్ళి పెటాకులూ లేకుండా ఇలాగ తాగి తాగి ఒళ్ళంతా గుల్ల చేసుకున్నాడు. ఆస్తంతా ఆరతి కర్పూరం చేసేసేడు. ఆ మీదట మందులకీ మాకులకీ లొంగని ఏదో మాయదారి రోగవొకటి! ఏనాటి కర్మాలో ఇయ్యన్నీ"

మసక వెన్నెల్లో బల్లకట్టు కాలవదాటుతోంది.

నేనీ కాలవ దాటి అవతలి ఒడ్డుకి వెళ్ళకుండా ఉంటే ఎంత బావుండేది! మధురమైన బాల్యస్మృతులు హృదయంలో పదిలంగా అలాగే ఉండేవి.

నా జ్ఞాపకాల దొంతర్లలో దాచుకున్న ఓ గొప్ప దృశ్య కావ్యాన్ని చేతులారా చెరిపేసుకున్నాను.

* * *

రాత్రంతా కలత నిద్ర–

ఉదయం లేస్తూనే నా బాల్య స్నేహితురాలు రత్నను కలుసుకోడానికెళ్లాను.

రత్న వాళ్ల నాయన దివాణంలో పాలేరుగా ఉండేవాడు.

రత్న నేనూ వ్రాసుకునే ఉత్తరాల వల్ల మా స్నేహం ఇంకా కొనసాగుతోంది.

రత్న ఆంధ్రా యూనివర్సిటీ పి.జీ చేసింది. ఇక్కడే ప్రైవేటు స్కూలొకటి నడుపుతోంది. రత్న భర్త డేవిడ్ గల్ఫ్‌లో ఉన్నాడు.

కాలవకివతలున్న జమీందారుగారి కారు షెడ్లనీ, ఆ చుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్నీ బాగుచేయించి స్కూలుకోసం ఉపయోగిస్తున్నానని వ్రాసిందోసారి.

ఆ ప్రదేశాన్ని వెతుక్కుంటూ వెళ్లేను.

రత్న నన్ను చూస్తూనే వాటేసుకుంది. నేరుగా తన ఇంట్లో దిగకుండా పిన్ని ఇంట్లో దిగేనని నిష్ఠురమాడింది. తన పిల్లల గురించి చెప్పి, మా పిల్లల యోగక్షేమాలడిగింది.

మాటల్లో భారతమ్మగారిని చూసొచ్చేనని చెప్పేను. మా బాల్యం నాటి సంగతుల్నీ, భారతమ్మగారి మంచితనాన్నీ తల్చుకుని కళ్లనీళ్ల పర్యంతమయ్యేం. ఆవిడ పట్టు చీరల్ని చింపి మాకు పరికిణీలు కుట్టించడాన్ని, బొమ్మల్ని అలంకరించడానికి పూసల నగలివ్వడాన్ని, బొమ్మల పెళ్ళిళ్ళకి పిండివంటలు, అటుకులు, బెల్లం పంపించడాన్ని మరీ మరీ తల్చుకున్నాం.

"నీకీ విషయం తెల్సా, ఈ స్థలంలో స్కూలు నడుపుకుంటానని నేను అడగడానికెళ్లినప్పుడు ఆవిడ సరేనన్నారు. రెంట్ ఎంత ఇమ్మంటారని ఆవిడ ముఖం మీద అడగలేక పోయాను. ఇప్పటికెన్నోసార్లు పున్నమ్మకి చెప్పేను అడిగి చెప్పమని. సమాధానం లేదు. నాకూ గిల్టీగా ఉంది. స్కాలర్‌షిప్పొచ్చేలోపల నా చదువుకి ఖర్చంతా భారతమ్మగారే పెట్టేరు. అంత మంచి ఆమెకీ వార్ధక్యంలో శాంతి లేకుండా పోయింది చూసేవా" అంది రత్న.

ఆ మధ్యాహ్నం మేమిద్దరం చర్చించుకుని ఓ నిర్ణయానికొచ్చేం.

రత్న, నేనూ దివాణానికి వెళ్లేం.

నేను కొత్తగా కొనుక్కున్న గంధం రంగు గద్వాల్ చీరమీద రత్న పదివేల రూపాయల నోట్లకట్ట పెట్టి భారతమ్మగారి చేతుల్లో పెట్టింది.

అనుకోని ఈ సంఘటనకి భారతమ్మగారి ముఖం వెలవెలాపోయింది.

ఆవిడ తేరుకునే లోపలే బైటపడ్డాం.

ఆ పదివేల రూపాయల్తో భారతమ్మగారి రాగిడీ విముక్తమై తిరిగి ఆమెని చేరాలని మా కోరిక.

పున్నమ్మ ఎక్కడికో వెళ్లొస్తూ మాకు ఎదురుపడింది.

నేను పర్సులోంచి వందనోటు తీసి పున్నమ్మ చేతిలో ఉంచాను.

పున్నమ్మ వెంటనే ఆ చేతినలాగే తిరగేసి ఆ నోటును నా చేతిలో జారవిడిచి 'నాకెందుకమ్మా డబ్బులు, డబ్బుల్తో నాకు పనేటి!' అంది.

"అది కాదు పున్నమ్మా-" పున్నమ్మ నా మాట వినకుండా వెళ్ళిపోయింది నవ్వుకుంటూ.

ఏం జరిగిందో తెలీదు, మర్నాడు నేను బయలుదేరేవేళకింకా పున్నమ్మ రాగిడీ విడిపించడానికి పిన్ని దగ్గరికి రానేలేదు.

* * *

ఢిల్లీ వెళ్లిన రెండు నెలలకి రత్న నుంచి ఓ పార్సెల్‌తో బాటు లెటరొచ్చింది.

"భారతమ్మగారు చీర, డబ్బు వెనక్కి పంపించేసింది. మీ పిన్ని ఇంటికి నేనొచ్చేసరికి అప్పుడే నువ్వెళ్లిపోయావని తెలిసింది. అది చాలక స్కూలు నడుపుతూన్న ప్రదేశాన్ని వెంటనే ఖాళీ చేసి ఇమ్మన్నారని పున్నమ్మ కబురు తెచ్చింది. నేను వెళ్ళి మాట్లాడే అవకాశాన్ని కూడా ఇవ్వలేదావిడ. అప్పటికప్పుడు కొత్త చోటును వెతుక్కుని సెటిలయ్యేసరికి తలప్రాణం తోకకొచ్చింది. అందుకే ఉత్తరం ఆలస్యమైంది" అంటూ వ్రాసింది.

*********

**కథామహల్ (99)**